క్లుప్తంగా

చిట్టాపురంలో పశువిజ్ఞాన బడి

ఈపూరు: మండలంలోని చిట్టాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ ఈపూరు సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడను ఎలా పొందాలో పశుపోషకులకు వివరించారు. పశుపోషణలో ఎలాంటి మెలుకువలు పాటిస్తే లాభాలు పొందవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖ తరపున సబ్సిడీలో ఇస్తున్న సమీకృత దాణాను వినియోగించుకోవాలన్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలు అకస్మాత్తుగా ఇబ్బందులకు గురైనప్పుడు 1962 నంబరు ద్వారా కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే ఉచిత పశువుల అంబులెన్స్ సేవలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ల పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం. సునీత, పశుగణ సహాయకుడు సాంబశివరావు, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో భాగంగా డ్రోన్ సర్వే ప్రారంభం

బొల్లాపల్లి: రీసర్వేలో భాగంగా మండలంలో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్ శర్మ గురువారం తెలిపారు. తొలుత వెల్లటూరు రెవెన్యూ గ్రామం శివారు నాయుడుపాలెంలో డ్రోన్ సర్వే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో డ్రోన్ సర్వే చేస్తామని, అనంతరం డ్రోన్ సర్వేలో ఓఆర్ఐ మ్యాప్‌ను గ్రామ రెవెన్యూ మ్యాప్‌తో అనుసంధానించి తదుపరి భూ హద్దులు నిర్ణయిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ చెప్పారు.

1న కారుమంచి బ్రాంచ్‌శాఖ ప్రారంభోత్సవం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో (మార్చి) వచ్చే నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు చైతన్య గోదావరి గ్రామీణ నూతన బ్యాంకు శాఖను ప్రారంభోత్సవం చేస్తున్నట్లు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ గురువారం తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు మారుతీరామ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, బ్యాంకు అధికారుల సారథ్యంలో నూతన బ్రాంచ్ ప్రారంభోత్సరం జరుగుతుందన్నారు. చిలకలూరిపేట బ్రాంచ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కావూరి సాయిచంద్ర చౌదరి కారుమంచి బ్యాంకు మేనేజరుగా నియామకమైనట్లు చెప్పారు. ఆయనతో పాటు సహాయ మేనేజరు గుబ్బల సుధీర్‌బాబు, నివ్య, నగదు అధికారి మహేష్, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి, గోపి, అచ్యుత్‌రెడ్డి, బాలాజి, చిన్నగోపి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి రూ.2.4 లక్షల కాసులహారం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారికి ముప్పాళ్లకు చెందిన భక్తుడు లక్ష్మీశెట్టి సూర్యతేజ రూ.2.40 లక్షల విలువైన బంగారు కాసుల హారాన్ని బహూకరించారు. ఆలయ కార్యాలయంలో శుక్రవారం ఈవో టి.సుధాకరరెడ్డికి బంగారు హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈవో సుధాకరరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో అమావాస్య, ప్రతి ఆదివారం చండీహోమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గంధ మహోత్సవం



నాదెండ్ల: అప్పాపురం గ్రామంలో కొలువైయున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 15వ ఉరుసు మహోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం రెండో రోజు గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అశ్వాన్ని ప్రత్యేకంగా అలంకరించి గంధాన్ని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. దర్గా నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. సంప్రదాయ బద్ధమైన మేళతాళాలతో జరిగిన ఊరేగింపులో కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం దర్గా వద్దకు వచ్చిన అశ్వంపై ఉంచిన గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముమ్మరంగా నాడు-నేడు పనులు



నాడు-నేడు మన బడి పథకంలో భాగంగా ఫేజ్-2 విభాగంలో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. రెండవ విడతలో 22 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక అయ్యాయని, రూ. 6 కోట్ల 30 లక్షల వ్యయంతో నిర్మాణ పనులకు అంచనాలు వేయగా, నేటి వరకు రూ. ఒక కోటి 18 లక్షల రివాల్వింగ్ ఫండు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రతి పాఠశాల పరిధిలో తరగతి గదుల్లో ఆధునీకరణ బెంచీలు, భవనాలు మైనరు, మేజరు మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ పనులు, మరుగుదొడ్లు, పాఠశాల గదులకు రంగులు వేయటం, తదితర అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు.

–శావల్యాపురం

ఉపాధి పనుల పరిశీలన

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనికల్పించాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనికి హాజరైన కూలీల మస్టర్లు పరిశీలించారు. పని జరుగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ.250లు కూలీ వచ్చే విధంగా పని చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

–నరసరావుపేట రూరల్



ట్యాబ్‌లు వాడుతున్నారా?



ఉప్పలపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఎంఈఓ కె.జ్యోతి కిరణ్ సందర్శించారు. సీసీఈ రికార్డ్స్, లెర్నింగ్ వార్డ్ డే, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. తరగతిలోకి వెళ్లి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను వారిని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. లెసన్ ప్లాన్స్, వర్క్‌బుక్ కరెక్షన్, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం, ప్రోగ్రెస్ కార్డ్సును పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించిన బైజూస్ యాప్ ట్యాబ్‌ల వినియోగిస్తున్న తీరుపై విద్యార్థులను ప్రశ్నించారు.

–నరసరావుపేట రూరల్

టీడీపీ శవ రాజకీయాలు ఖండించాలి

- బాలకోటిరెడ్డిని చంపింది ఆ పార్టీ నాయకులే
- విలేకర్ల సమావేశంలో మరోసారి స్పష్టం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పొడా చైర్మన్ మిట్టపల్లి

నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ శవరాజకీయాలను మానుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. రొంపిచర్ల మండలం అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డిని హత్యచేసింది ఆ పార్టీకి చెందిన నాయకులేనని తెలిసినా తనపైన, వైఎస్సార్‌సీపీ నాయకులపైన నెపం వేయటం దుర్మార్గం, దారుణమైన విషయమన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా వైఎస్సార్ సీపీ నాయకులే కారణం, ప్రోత్సహిస్తుంది ముఖ్యమంత్రి అంటూ చంద్రబాబునాయుడు విస్తృతంగా దుష్ప్రచారం చేయిస్తున్నాడన్నారు. దీనికి ఉదాహరణ బాలకోటిరెడ్డి ఉదంతమేనన్నారు. బాలకోటిరెడ్డిని చంపింది ఆయన అనుచరుడేనని ఆయన భార్య ప్రకటించిందన్నారు. కాల్పుల్లో గాయపడి ప్రైవేటు హాస్పిటల్‌లో 20 రోజుల పాటు చికిత్స పొందుతున్న బాలకోటిరెడ్డి తన మరణవాంగ్మూలంలో ఎక్కడా తన పేరుగాని, వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లుగాని చెప్పలేదన్నారు. పమ్మి వెంకటేశ్వరరెడ్డే చేశాడని చెప్పాడన్నారు. ఈ విషయం తెలిసినా అతని అంత్యక్రియలకు హాజరైన రాష్ట్ర టీడీపీ నాయకులు తనపైన, పార్టీ నాయకులపైన నెపం వేయటం దారుణమన్నారు. దీనికి ఎల్లోమీడియా వంతపాడుతూ మేము చెప్పిన వివరణలను చిన్న వార్తలుగా ప్రచురిస్తూ వారి ఆరోపణలు పుంఖాను పుంఖాలుగా ప్రచురిస్తున్నారన్నారు. బాలకోటిరెడ్డి మృతదేహంతో పట్టణంలో శవయాత్ర చేయాలనుకున్న టీడీపీ నాయకులను అడ్డుకున్న పోలీసుల కారణంగా రాస్తారోకో చేసిన అరవింద బాబు, ఆ పార్టీ నాయకులు గోపిరెడ్డి చనిపోవాలి, సీఎం జగన్ చనిపోవాలని నినాదాలు చేయటం ఎమిటని ప్రశ్నించారు.. ప్రజాస్వామ్యంలో ఇటువంటి వారు రాజకీయాలకు అవసరమా అన్నారు.

పట్టాభిని కొట్టారంటూ 2020 నాటి ఫొటోలతో ఈనాడు దినపత్రిక అచ్చువేయటం చూస్తుంటే సీఎం జగన్ కారెక్టర్‌ను దెబ్బతీయాలనే వ్యూహంలో భాగంగానే చేస్తున్నారన్నారు. ఎల్లో మీడియాచేత చంద్రబాబు రోజుకొక వార్త రాయిస్తున్నాడన్నారు. కోటప్పకొండ తిరునాళ్లు విజయవంతంగా జరిగితే ఆ వార్తకు స్థానం లేదన్నారు. ఇది ప్రజలను మోసం చేయటమే అవుతుందన్నారు. ఇది దారుణమైన అంశమన్నారు. సమావేశంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. సుజాతాపాల్, మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వేల్పూరులో రెండవ రోజు గడప గడపకు కార్యక్రమం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: పార్టీలకు కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఇంటింటికీ తిరిగి నవరత్నాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన కరపత్రాలను ప్రజలకు అందజేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతుంటే కొందరు ఓర్వలేక ఇష్టానుసారంగా తనపై ఆరోపణలు, విమర్శలు, దూషణలు చేయటం సిగ్గుచేటన్నారు. జన్మభూమి అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. గ్రామాభివృద్ధిలో రూపాయి ఖర్చు పెట్టని చేతకాని వారు మాట్లాడటం చాలా బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచార ఆర్భాటం మినహా చేసిన అభివృద్ధి చేయలేదన్నారు. వేల్పూరు గ్రామ పంచాయతీలో రూ.15 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.3 కోట్ల వ్యయంతో ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ఉప సర్పంచ్ మారాసు రామయ్య, తూమాటి కబ్బారావు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, పంచాయతీ కార్యదర్శులు కొమటినేని అశోక్‌చౌదరి, ఆళ్ళ యుగంధర్, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డిపోలో సంస్మరణ సభ



నరసరావుపేట: డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, అమరావతి జేఏసీ మాజీ జనరల్ సెక్రటరీ వై.వీ.రావు సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ముఖ్య అతిథిగా హాజరై వై.వి.రావు గారి సేవలను కొనియాడారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్, యస్.కె.మాబుజాని ఆధ్వర్యంలో జరిగిన ఈ సంతాప సభలో రాష్ట్ర కార్యదర్శి యం.కోటయ్య, జిల్లా కార్యదర్శి జి.టి.రావు, జిల్లా జాయింట్ సెక్రటరీ యం.శ్రీధర్, సూపరింటెండెంట్ యం. హనుమంతరావు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, డిపో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బాబాపేట సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ టి.సుబ్బారావు తెలిపారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పై కప్పు తొలగించి చోరీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో గల ఓ కిరాణా షాపులో బుధవారం దొంగతనం చోటు చేసుకుంది. ముండ్లమూరు సెంటర్‌లో కిరాణా మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అచ్యుత మూర్తెయ్య కిరాణా షాపులో పై కప్పు రేకులు తొలగించి సుమారు రూ.50వేలు విలువైన సరుకులను దొంగలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది!

- ప్రజలు అప్రమత్తతో, జాగ్రత్తతో వ్యవహరించాలి
- పులి పాదముద్రలు గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వండి

బొల్లాపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు పరిసర గ్రామ ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. వినుకొండ రేంజ్ పరిధిలోని బొల్లాపల్లి, నాయుడు పాలెం సెక్షన్ డీఆర్‌వోలు వై. సూర్యనారాయణ, ఎం.సురేంద్ర బాబులు అటవీ పరిసర గ్రామాలను అప్రమత్తం చేస్తూ ప్రజలను జాగ్రత్త వహించాల్సిందిగా సూచించారు. ఇటీవల ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురం, యర్రగొండపాలెం పరిసర అటవీ ప్రాంతంలో పులి సంచార జాడలు ఉన్నట్లు మార్కాపురం సబ్ డివిజన్ ఎఫ్‌బీటీటీ విఘ్నేష్ అప్సర్ హెచ్చరించారని తెలిపారు. ఈ ప్రాంతాన్ని దాటి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వినుకొండ రేంజ్ అటవీ ప్రాంతానికి ప్రవేశించి ఉండవచ్చని, ఈ మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ పరిసర గ్రామ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. మండలంలోని కనుమల చెరువు, కంద్రిక, రావులాపురం, సరికొండపాలెం, గండిగనుమల, దోమలగుండం బీట్ పరిధిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అటవీ పరిసర ప్రాంతం కలిసి ఉందని తెలిపారు. ఆయా సమీప గ్రామాల ప్రజలు పులి సంచరిస్తున్నట్లు జాడలు కనిపించినట్లయితే అటవీశాఖ అధికారులకు తప్పనిసరిగా సమాచారం అందజేయాలని అన్నారు. పులి పాదముద్రలు గమనించి గుర్తించాలని అవగాహన కల్పించారు. ఈ ప్రాంత ప్రజలు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. ఒంటరిగా తిరగవద్దని, సంచరిస్తున్న పులి అడుగుజాడలు గుర్తించినట్లయితే తప్పనిసరిగా సమాచారం అందజేయాలన్నారు. అదేవిధంగా అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలకు తావివ్వకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. అటవీహక్కుల చట్టం ప్రకారం ఎలాంటి నష్టం లేకుండా చూడాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నవారిలో అటవీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా కోదండరాముడి ఆలయ వార్షికోత్సవం

నేడు కల్యాణం, రేపు భారీ అన్నదానం



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని శంభునిపాలెంలో కొలువైయున్న కోదండరామస్వామి దేవస్థాన 16వ వార్షికోత్సవ అష్టబంధ మహా మహా సంప్రోక్షణ వేడుకలు గురువారం మూడో రోజు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకస్వామి పరాంకుశం విజయ రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జి.అశోక్ దంపతులు పీటలపై కూర్చుని 108 కలశాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి కల్యాణం జరగనుంది. శనివారం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం, భారీ అన్నదానం జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు వేసిన చలువ పందిరిలో మహాహోమం, శాంతిహోమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ధర్మకర్త నల్లమోతు పుల్లారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉచితంగా భూ సర్వే హద్దురాళ్లు: జేసీ

నరసరావుపేట రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని దొండపాడులో జరుగుతున్న భూముల రీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో భూముల రీసర్వే పూర్తికావడంతో ఇప్పటికే రైతులకు పాస్‌బుక్‌లను అందజేశారు. రీ సర్వే అధారంగా గ్రామంలో హద్దురాళ్లు వేసే పనులను చేపట్టారు. పంట భూముల్లో చేపట్టిన హద్దురాళ్లు వేసే పనిని ఆయన పరిశీలించారు. భూ సమస్యలకు తావు లేకుండా పకడ్బందీగా భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని పది గ్రామాలకు సంభందించిన 23 వేల అయా గ్రామాలకు చేర్చినట్లు తెలిపారు. హద్దురాళ్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. గ్రామానికి తరలించిన హద్దురాళ్లను భూముల వద్దకు చేరవేసి అడుగున్నర గుంత తీసి నిలబెట్టే పనికి కూడా ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఒక్కో హద్దురాయిని తరలించి నిలబెట్టినందుకు రూ.90లు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణా నాయక్, గ్రామ సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్వే అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: ఐక్య ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నరసరావుపేటలో ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న పల్నాడు జిల్లా యూటీఎఫ్ తొలి కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను గురువారం సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా పల్నాడు జిల్లా ఏర్పాటు చేశాక తొలి సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే విద్యా సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.తిరుపతి స్వామి, స్థానిక సంఘ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కెఎండీ యాసిన్, నాయకులు బి.పాపయ్య, ఎల్.రాము, నాగూర్‌షావలి పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రాష్ట్ర మహాసభలు నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి దారపనేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శంకరరాజుతో కలిసి ఆయన మహాసభలకు సంబంధించిన గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్చి 5,6 తేదీల్లో నెల్లూరిలోని శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో ఈ మహాసభలను రెండు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన సంఘ నాయకులు హాజరై విద్య వ్యవస్థ, ఉపాధ్యాయ సంఘాల్లోని పలు సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. ఏపీయూఎస్ సభ్యులు, ఇతర ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శైలజ, కోటేశ్వరమ్మ, శాంతిశైలజ, పి.శ్రీనివాసరావు, ప్రభాకర శర్మ, అబ్దుల్ సలామ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



ఏఎంసీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చిలకలూరిపేట: సౌమ్యుడు, రైతాంగ సమస్యల పట్ల అవగాహన కలిగిన తోట రాజేంద్రప్రసాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులు కావడం అభినందనీయమని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఇటీవల ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన తోట రాజేంద్రప్రసాద్‌కు మిత్రా సర్వీస్ సొసైటీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, గిరిజన సంఘాల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వర్గాల వారిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు కల్పించటంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని చూపిస్తున్న చొరవ ప్రశంసనీయమైనదని చెప్పారు. అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కార దిశగా ఆలోచన చేసే కుటుంబం నుంచి వచ్చిన తోట రాజేంద్ర ప్రసాద్‌కు సముచిత స్థానం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కొండ్రముట్ల నాగేశ్వర రావు, మాదాసు పృథ్వీసాయి, బి శ్రీను నాయక్, కుంభా నాగేశ్వరరావు, గుంజి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యమిచ్చినందుకు సీఎంకు అభినందనలు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు గురువారం పెద్దచెరువులోని బీసీ కమ్యూనిటీ హాలులో పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీసీ అభ్యర్థులకు అవకాశం ఇచ్చినందుకు సీఎం జగన్‌ను అభినందించారు. ఈసందర్భంగా ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం స్వామి మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లతో పాటు రాజ్యాధికారంలో కూడా పాలు పంచుకునే అవకాశం కల్పించినందుకు బీసీలు అందరూ కృతజ్ఞతలు తెలియచేస్తున్నారన్నారు. బీసీలకు వడియరాజుల జిల్లా సంక్షేమ కమిటీ సభ్యుడు వేముల శివ, వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ బి.పూర్ణచంద్రరావు, మాజీ కౌన్సిలర్లు మాడిశెట్టి మోహనరావు, కారుమంచి మీరావలి, వడియరాజుల సంఘ పట్టణ అధ్యక్షులు చల్లా హనుమంతరావు మాట్లాడారు. కార్యక్రమంలో జంగం కార్పొరేషన్ డైరెక్టర్ తోట వీరయ్య, బీసీ నాయకులు కుంచాల కోటేశ్వరరావు, టి.చంద్రశేఖర్, షేక్ మాబు, చల్లా నాగేశ్వరరావు, ఆరుదల సాంబశివరావు, మురికపూడి రాంబాబు, గోగుల మనోహర యాదవ్, కుంచాల వెంకటరావు పాల్గొన్నారు.

రేపు గణపయ్య తిరునాళ్ల

యడ్లపాడు: ముక్కోటి దేవతల్లో ప్రథమ పూజితుడైన విఘ్నేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యడ్లపాడు మండలం కారుచోల-గుత్తావారిపాలెం గ్రామాల మధ్య పీబీసీ కాలువ ఒడ్డుపై కొలువున్న ఈ స్వామి 32వ వార్షికోత్సవానికి సంబంధించిన పనులు చురుగ్గా చేస్తున్నారు. ఈ సందర్భంగా గుడి మరమ్మతులు, పెయింటింగ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని.. అలాగే భారీగా తరలి వచ్చే భక్తుల కోసం అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేస్తున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజాము నుంచి గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలతో ప్రారంభించి అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కలిగిస్తారు. సాయంత్రం మూడు గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తాయని, తిరునాళ్ల సందర్భంగా జాగరణ చేసే భక్తులకు భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు చెప్పారు. భక్తులు వేలాది వచ్చి వినాయక స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.